సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 12 । ఆగస్టు । 2025



చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16 వేలు, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.46

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.46, కనిష్టంగా రూ.34 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 3,375 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
32.5°/21.1°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై జిల్లా అంతటా మోస్కరు వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

అంధకారంలో 15 గ్రామాలు

- విద్యుత్ అధికారుల తీరుపై గ్రామీణుల నిరసన



అధికారుల అలసత్వంపై నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ముదిగుబ్బ: మూడు రోజులుగా 15 గ్రామాలు అంధకారంలో మగ్గుతున్నాయి. చినుకు పడితే చాలు.. కరెంటు సరఫరా నిలిచిపోతుండటంతో గ్రామీణులు కునుకు కరువై అల్లాడిపోతున్నారు. అయినా విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంతో సోమవారం గ్రామీణులంతా ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే... మూడు రోజుల క్రితం పడిన వర్షానికి మండల పరిధిలోని మల్లేపల్లి చుట్టుపక్కల ఉన్న 15 గ్రామాలకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. మూడు రోజులైనా సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో బోర్లు కూడా పనిచేయక తాగునీటి సమస్య ఉత్పన్నం కావడం.. రాత్రి వేళల్లో విష పురుగులు బెడద ఉండటంతో సోమవారం పలు గ్రామాల వారు మరోసారి విద్యుత్ అధికారులను సంప్రదించారు. అయినా సరైన సమాధానం చెప్పకపోవడంతో స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం నాటికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించకపోతే రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

22న ఖాద్రీ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా ఈనెల 22వ తేదీ (శుక్రవారం) ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి వరలక్ష్మీ వ్రతాలు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో పాల్గొనాలనుకునే వారు ఈనెల 18వ తేదీలోపు దేవస్థానంలో పేర్లు నమోదు చేయించుకోవాలని ఈఓ సూచించారు. ఇందుకోసం స్వయంగా ఈఓ కార్యాలయానికి వచ్చి అప్లికేషన్ పూర్తి చేయడంతో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

ఇంటర్ జోనల్ స్థాయి క్రీడా పోటీలకు జిల్లా జట్టు



ఎంపికైన జిల్లా జట్టులోని క్రీడాకారులు

హిందూపురం టౌన్: ఇంటర్ జోనల్ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ జట్టు అర్హత సాధించింది. కడపలో ఆదివారం జరిగిన పెన్నా జోన్ జోనల్ క్వాలిఫయర్ మ్యాచ్‌లో కడప జట్టు తలపడిన జిల్లా జట్టు పెనాల్టీ కిక్స్ రెండు గోల్స్ తేడాతో గెలుపొందింది. దీంతో ఈ నెల 16, 17వ తేదీల్లో విశాఖపట్నంలో జరిగే ఇంటర్ జోనల్ స్థాయి చాంపియన్ షిప్ పోటీలకు అర్హత సాధించింది. ఈ జట్టుకు కోచ్‌గా బీకే మహమ్మద్ సలీమ్, మేనేజర్‌గా ఇర్షాద్ అలీ వ్యవహరించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను జిల్లా ఫుట్‌బాల్ గౌరవ అధ్యక్షుడు అనిల్‌కుమార్ అభినందించారు.

- ఓడీ చెరువు మండలానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి ఐదెకరాల్లో వేరుశనగతో పాటు కంది సాగు చేశాడు. ఇందుకోసం ఎకరాకు నాలుగు బస్తాల చొప్పున ఎరువులు వేయాలని నిర్ణయించుకున్నాడు. ఆ మేరకు డబ్బు సర్దుబాటు చేసుకుని ఎరువులు కొనేందుకు కదిరికి వచ్చాడు. ఎరువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడం... తెచ్చుకున్న డబ్బు సరిపోకపోవడంతో... కొనుగోలు చేయకనే ఇంటిదారి పట్టాడు.

- ముదిగుబ్బకు చెందిన రామ్మోహన్‌రెడ్డి మూడు ఎకరాల్లో చీనీ పంట పెట్టాడు. ఎరువుల కోసం అనంతపురం వెళ్లగా.. ధరలు పెరగడంతో డబ్బు సరిపోలేదు. దీంతో ఎరువుల దుకాణంలో అప్పుపెట్టి ఎరువులు తీసుకువెళ్లాడు. పంట చేతికొచ్చాక వడ్డీతో సహా అప్పు తీర్చాల్సిన పరిస్థితి.



ఎరువు.. ధర దరువు..!



ఏడాదిలోనే రెండు సార్లు పెంచిన కూటమి ప్రభుత్వం

- బస్తాపై రూ.50 నుంచి రూ.320 వరకు పెంపు
- ఎరువుల భారంతో ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- గత ప్రభుత్వంలో ఒక్కసారి కూడా ఎరువుల ధర పెంచని వైనం

కదిరి: ప్రకృతికి ఎదురొడ్డి వ్యవసాయం చేస్తున్న జిల్లా రైతాంగానికి పాలకులు ఏమాత్రమూ సాయంగా నిలవలేకపోతున్నారు. పైగా రైతన్నలపై అదనపు భారం మోపుతూ వ్యవసాయాన్ని మరింత సంక్షోభంలోకి నెడుతున్నారు. ఇప్పటికే వ్యవసాయ ఖర్చులు పెరిగి అల్లాడిపోతున్న రైతులను..ఎరువు ధరలు మరింత భయపెడుతున్నాయి. కూటమి ప్రభుత్వం తన ఏడాది పాలనలోనే రెండుసార్లు ఎరువుల ధరలు పెంచింది. దీంతో ఏం చేయాలో తెలియని చాలా మంది రైతులు కాడి కిందపడేసే పరిస్థితి నెలకొంది.

జిల్లాలో ఎరువుల బస్తా (50 కిలోలు)ధర ఇలా...

ఎరువు రకం	పాత ధర	కొత్త ధర
పొటాష్	రూ.1,535	రూ.1,800
10-26-26	రూ.1,470	రూ.1,800
12-32-169	రూ.1,470	రూ.1,720
16-16-16	రూ.1,450	రూ.1,600
24-24-0	రూ.1,700	రూ.1,800
20-20-013	రూ.1,300	రూ.1,400
సూపర్‌ఫాస్ఫేట్	రూ.570	రూ.650
14-35-14	రూ.1,700	రూ.1,800
15-15-15-0-9	రూ.1,450	రూ.1,600

జిల్లాలో పంటల సాగు ఇలా

జిల్లా ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 2,69,167 హెక్టార్లు కాగా, సరైన సమయంలో వర్షాలు కురవక ఇప్పటి దాకా కేవలం 54,139 హెక్టార్లలోనే వివిధ పంటలు సాగులోకి వచ్చాయి. అందులో వేరుశనగ 27,985 హెక్టార్లు, వరి 276, మొక్కజొన్న 6,641, రాగి 632, కంది 9,369, ఆముదం 2,300, టమాట 1,101 హెక్టార్లతో పాటు ఇంకా పలు రకాల పంటలు సాగులో ఉన్నాయి.

పెరుగుతున్న ఎరువుల వినియోగం

ఏటా ఖరీఫ్‌తో పాటు రబీ సీజన్‌లో కూడా పంటల సాగుకు డీఏపీ, కాంప్లెక్స్, సూపర్ ఫాస్ఫేట్ వంటి ఎరువుల వాడకం పెరుగుతోంది. మోతాదుకు మించి రసాయనిక ఎరువుల వినియోగంతో పెట్టుబడి కూడా పెరిగింది. ఫలితంగా దిగుబడి ఎంత వచ్చినా రైతుకు పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం 50 కిలోల ఎరువుల బస్తాపై రూ.50 నుంచి రూ.320 వరకు పెంచింది. జిల్లాలో ఒక్కో మండలంలో సరాసరిన రసాయనిక ఎరువులు ఏడాదికి 3,500 టన్నులు వినియోగిస్తారని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. టన్నుపై కనిష్టంగా రూ.1,000 నుంచి గరిష్టంగా రూ.4 వేల వరకూ ఎరువుల ధరలు పెరగడం అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తోంది. ఈ క్రమంలో చాలా మంది రైతులు ఫర్టిలైజర్ దుకాణాల వద్ద అప్పు పెడుతున్నారు. పంట వచ్చాక వడ్డీతో సహా తీర్చాల్సి ఉండటంతో వచ్చిన ఆదాయం ఎరువుల అప్పుకే సరిపోతోంది.

పొంతన లేని కూటమి మాటలు

జిల్లాలో యూరియా, డీఏపీ ఎరువులు అవసరానికి సరిపడా లభించలేదు. ఒకవేళ దొరికినా అధిక ధరలతో పాటు వేరే ఎరువులు కూడా కొనాలనే ఒత్తిడిని జిల్లా రైతాంగం ఎదుర్కొంటోంది. 'అవసరానికి సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయి' అని ఒకసారి, 'కేంద్రం... రాష్ట్రానికి నెలవారీగా ఇవ్వాల్సిన కోటా ఎరువులు పంపడం లేదు' అని ఇంకోసారి..ఇలా కూటమి సర్కారు పొంతన లేని ప్రకటనలు చేయడం రైతులను గందరగోళానికి గురి చేస్తోంది. వాస్తవానికి కేంద్రం నుంచి ఏపీకి రావాల్సిన ఎరువులను తెప్పించుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమవుతోందని టీడీపీ నేతలే కొందరు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

ఎరువుల ధర నియంత్రణలోనూ విఫలం

ఎరువుల కంపెనీలు ఇష్టారాజ్యంగా ధరలు పెంచుకుంటూ వెళ్తున్నా కూటమి సర్కార్ కనీస చర్యలు తీసుకోవడం లేదు. అసలు రాష్ట్రానికి ఎంత ఎరువులు అవసరం...ఎంత సరఫరా అయ్యిందో కూడా తెలుసుకునే తీరిక ప్రభుత్వానికి లేకపోయింది. ఇక ఎరువుల ధర నియంత్రణ గురించి పట్టించుకున్న వారే లేరు. కనీసం వివిధ ఎరువుల కంపెనీల ప్రతినిధులతో సమావేశం కూడా ఏర్పాటు చేయలేదు.

ఎకరాకు రూ.3 వేలు అదనపు భారం



ప్రభుత్వం ప్రతి ఆరునెలలకోసారి ఎరువుల ధరలు పెంచుతోంది. కొన్నిచోట్ల ఎమ్మార్పీ మించి ధర వసూలు చేస్తున్నారు. దీంతో ఎకరాకు రూ.3 వేలు చొప్పున అదనపు భారం పడుతోంది. పంటకు గిట్టుబాటు ధరలు కూడా అంతంత మాత్రమే. అందుకే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

–వై.శ్రీధర్‌రెడ్డి, ఉప్పార్లపల్లి, నల్లచెరువు మండలం

సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలి



రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలి. అలా చేస్తే దిగుబడులు పెరగడంతో పాటు పెట్టుబడి కూడా బాగా తగ్గుతుంది. జిల్లాలోఎక్కడైనా అధిక ధరలకు ఎరువులు అమ్మితే ఆ దుకాణాన్ని సీజ్ చేస్తాం. కృత్రిమ డిమాండ్ సృష్టించినా చర్యలు తప్పవు.

–సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

2014-19 మధ్య కూడా ఇంతే..

రాష్ట్ర విభజన తర్వాత 2014–19 మధ్య కాలంలోనూ ఏపీలో చంద్రబాబు నేతృత్వంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం... ఆ ఐదేళ్లలో నాలుగు సార్లు ఎరువుల ధరలు పెంచింది. ఇప్పుడు కూడా అంతే. అప్పుడే రెండు సార్లు పెంచింది. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్న ఆ ఐదేళ్లు ఏనాడూ ఎరువుల ధరలు పెంచకపోగా విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాల వద్దే అందుబాటులో ఉంచారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. ఎరువుల కోసం మండల కేంద్రాలు, పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించం

- అధికారులను హెచ్చరించిన కలెక్టర్ టీఎస్ చేతన్
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 226 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించబోమని కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. ప్రజలు తమ సమస్యలు తీరుతాయన్న నమ్మకంతో పనులను మానుకుని మరీ కలెక్టరేట్ వరకూ వచ్చి అర్జీలిస్తారని, వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా ప్రతి అధికారి నిబద్ధతతో పనిచేయాలన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలపై మొత్తం 226 అర్జీలు అందగా... కలెక్టర్ టీఎస్ చేతన్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి ఆయా శాఖలకు పంపారు. అనంతరం ఆయన అధికారులతో సమావేశమయ్యారు. అర్జీలు పరిష్కరించే సమయంలో అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు పెండింగ్, బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్ లేకుండా సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం 'హర్ ఘర్ తిరంగ' కార్యక్రమంలో భాగంగా పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, డీపీఓ సమత, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.

డెత్ క్లెయిముల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ

అనంతపురం సిటీ: ఈపీఎఫ్ఓలో సభ్యులుగా ఉండి మరణించిన వారి డెత్ క్లెయిముల పరిష్కారానికి సెప్టెంబర్ వరకూ ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని ఆ శాఖ కడప ప్రాంతీయ శాఖ కార్యాలయ కమిషనర్-1 రవితేజ్‌కుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈపీఎఫ్ఓ సభ్యులకు, యాజమాన్యాలకు, పెన్షనర్లకు మెరుగైన సేవలందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. డెత్ క్లెయిముల సమస్య పరిష్కారం కాని పక్షంలో కడపలోని ప్రాంతీయ కార్యాలయంలో లేదా జిల్లా కేంద్రంలోని తమ శాఖ కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు. ఈపీఎఫ్ సభ్యులు యూఏఎన్‌కి ఈ–నామినేషన్ జత చేసి ఉంటే మరణానంతరం వారి కుటుంబీకులు ఆన్‌లైన్‌లోనే డెత్ క్లెయిములు సమర్పించాల్సి ఉంటుందన్నారు. సందేహాల నివృత్తి కోసం కడపలోని ప్రాంతీయ కార్యాలయంలో 94911 38280 నంబర్‌తో ప్రత్యేక విభాగం కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

బాలిక హత్య కేసులో ముద్దాయికి యావజ్జీవం



హిందూపురం/పుట్టపర్తి టౌన్: బాలికను కర్కశంగా చంపి శవాన్ని పూడ్చిపెట్టిన కేసులో ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ అనంతపురం పోక్సో కోర్టు న్యాయమూర్తి చిన్నబాబు సోమవారం తీర్పు చెప్పారు. అలాగే సాక్ష్యాలను తారుమారు చేసినందుకు మరో ఐదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. కేసు వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకలోని గౌరీబిదనూరు తాలూకా నామగుండ్ల గ్రామానికి చెందిన మంజులకు ఇద్దరు కుమార్తెలు. గ్రామంలో తనకు ఎవరూ లేకపోవడంతో హిందూపురం మండలం తూమకుంట గ్రామంలోని తన అక్క రత్నమ్మ వద్దకు వచ్చి ఉండేవారు. రత్నమ్మ భర్త గంగాధర్ 'పొలం వద్దకు వెళ్దాంరా.. నీకేమైనా కొనిస్తాను' అంటూ మంజుల ఎనిమిదేళ్ల కుమార్తె (మూడో తరగతి విద్యార్థిని)ను రోజూ పిలిచేవాడు. గంగాధర్ అంతకు మునుపే రెండు కేసుల్లో జైలుకు వెళ్లొచ్చాడు. అతని ప్రవర్తన చూసి భయపడుతూ చిన్నారిని పంపేందుకు తల్లి మంజుల నిరాకరించేది. అయితే గత ఏడాది ఆగస్టు ఎనిమిదో తేదీన చిన్నారిని మచ్చిక చేసుకున్న గంగాధర్ పొలం వద్దకు పిలుచుకెళ్లాడు. అక్కడ క్రూరంగా చంపి.. అత్యాచారానికి ప్రయత్నించాడు. మృతదేహాన్ని సమీపంలోని పెన్నానదిలో పూడ్చిపెట్టాడు. సాయంత్రం ఒక్కడే ఇంటికి తిరిగొచ్చిన గంగాధర్‌ను తన కూతురు ఎక్కడని మంజుల అడిగింది. ఆమెతో పాటు బంధువులు కూడా నిలదీయడంతో చంపేసి నది వద్ద పూడ్చేశానని చెప్పాడు. దీంతో తల్లి హిందూపురం రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుణ్ని అరెస్టు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. 17 మంది సాక్షులను విచారించిన అనంతరం గంగాధర్‌పై అభియోగాలు రుజువు కావడంతో యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

విస్తారంగా వర్షాలు

- జిల్లా అంతటా జడివాన
- సోమవారం 24.6 మి.మీ సగటు వర్షపాతం నమోదు



ఎనుములపల్లి చెరువుకు చేరుతున్న కాలువ నీరు



వెంకటగారిపల్లి వద్ద బ్రిడ్జి కింద నిలిచిన వర్షపు నీరు

పుట్టపర్తి అర్బన్: వరుణుడు తొమ్మిది రోజులుగా తెరిపినివ్వడం లేదు. జిల్లా అంతటా విస్తారంగా వర్షిస్తూ చెరువులకు జలకళ తెచ్చాడు. ఆదివారం రాత్రి నుండి సోమవారం వరకూ జిల్లాలోని 32 మండలాల పరిధిలో వర్షం కురిసింది. ఒక్కరోజే 24.6 మి.మీ సగటు వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా ధర్మవరం మండలంలో 67.4 మి.మీ, అమరాపురం మండలంలో 56.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక తనకల్లు మండలంలో 48.2 మి.మీ, కొత్తచెరువు 47, బుక్కపట్నం 44, కదిరి 42.4, చిలమత్తూరు 33.4, పెనుకొండ 31.4, కనగానపల్లి 30.8, అమడగూరు 30.4, పుట్టపర్తి 28.4, సీకేపల్లి 25.4, ముదిగుబ్బ 24.8, తాడిమర్రి 24.2, రొద్దం 23.6, నల్లమాడ 23.2, నల్లచెరువు 22.2, హిందూపురం 21.2, లేపాక్షి 20.8, రొళ్ల 19.2, గాండ్లపెంట 18.6, గుడిబండ 18.2 , సోమందేపల్లి 17.6, పరిగి 16.2, బత్తలపల్లి 14.2, అగళి 10.6, ఓడీచెరువు 8.2, మడకశిర 7.6, రామగిరి 6.2, తలుపుల 2.8, గోరంట్ల 2.2, ఎన్పీకుంట మండలంలో 1.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

కోలుకున్న పంటలు.. పెరిగిన చీడపీడలు

తాజా వర్షాలతో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు ఆశాజనకంగా ఉన్నా.. తెగుళ్లు పెరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. వేరుశనగ, కంది పంటలకు చీడ పీడలు అధికమయ్యాయంటున్నారు. కూరగాయల పంటలకూ తెగుళ్ల బెడద ఎక్కువగా ఉందని చెబుతున్నారు. ఇక కొన్నిరోజులుగా కురుస్తున్న జడివానతో అక్కడక్కడా ఇళ్లు కూలుతున్నాయి. ఈ నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివాసం ఉండకూడదని అధికారులు సూచిస్తున్నారు.

మా రూటే సప'రేటు'!

- ఎక్సైజ్ వారిలా తమకూ మామూళ్లివ్వాలంటున్న సివిల్ పోలీసులు
- వైన్ షాపుల నిర్వాహకులకు హుకుం
- స్టేషన్ పరిధిలో ఒక్కో వైన్‌షాపు నుంచి రూ.20 వేలు డిమాండ్



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి జిల్లాలో ఎక్సైజ్ పోలీసులే కాదు సివిల్ పోలీసుల దందా మరీ ఎక్కువైంది. మద్యం షాపుల వారు మామూళ్లు ఇవ్వకపోతే బెదిరిస్తున్నారు. ఎక్సైజ్ పోలీసులూ, తాము ఒకటి కాదని, వాళ్లకిస్తే తమకిచ్చినట్టు కాదంటూ బహిరంగంగానే చెబుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి సివిల్ పోలీస్ స్టేషన్‌కూ మామూళ్లు వెళ్లకపోతే వైన్‌షాపు నడుపుకోలేరని హెచ్చరిస్తున్నారు. లేకుంటే పర్మిట్ రూములు, బెల్టుషాపులకు అనుమతి లేదంటున్నారు.

అడిగినంత ఇస్తే దర్జాగా..

మామూళ్లు ఇస్తే దర్జాగా వ్యాపారం చేసుకోవచ్చు. ఉదాహరణకు అనంతపురంలోని రామ్‌నగర్ బ్రిడ్జి కింద ఓపెన్ బార్‌లా వైన్‌షాపు నడుస్తోంది. మహిళలు ఈ మార్గంలో నడుచుకు వెళ్లాలంటే కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి నుంచి నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌కు ప్రతి నెలా రూ.25 వేలు వెళ్తోంది. ఇలా శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో దర్జాగా పర్మిట్ రూములు, బెల్టుషాపులు నడుపుకోవాలంటే ఎక్సైజ్ పోలీసులతో పాటు సివిల్ పోలీసులనూ సంతృప్తి పరచాల్సిందేనని తెలిసింది. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు రాయాల్సింది ఎక్సైజ్ అధికారులే. కానీ తాము లేకుండా వ్యాపారాన్ని చేసుకోలేరని సివిల్ పోలీసులు చెబుతున్నట్లు సమాచారం.

అర్బన్‌లో ఎక్కువగా..

శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో 230 వరకూ వైన్ షాపులు ఉన్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో పోలీస్ స్టేషన్లలో ఇచ్చినంత తీసుకుని చూసీ చూడనట్టు వెళుతున్నారు. కానీ అనంతపురం అర్బన్‌లో మాత్రం కచ్చితంగా ఫిక్స్ చేసినంత ఇవ్వాల్సిందే. ఉదాహరణకు నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 9 షాపులున్నాయి. ఆయా వైన్ షాపుల నిర్వాహకులంతా కలిసి నెలకు తప్పనిసరిగా రూ.1.80 లక్షలు ఇవ్వాల్సిందే. బార్‌లూ ఫిక్స్ చేసినంత ఇవ్వాలి. వన్‌టౌన్ పీఎస్‌కు కూడా అంతేనని తెలిసింది.

ధాబాలు.. హోటళ్లు ఉంటే బోనస్

వైన్‌షాపులతో పాటు ధాబాలు, హోటళ్లు ఉంటే సివిల్ పోలీసులకు బోనస్ కింద లెక్క. జాతీయ రహదారిపై ఉన్న ప్రతి ధాబా, హోటల్‌లోనూ లిక్కర్ సిట్టింగ్ ఉంది. ఇక్కడ తనిఖీలకు వెళ్లాల్సింది కూడా సివిల్ పోలీసులే. దీంతో ధాబాలు, హోటళ్లు శక్తిని బట్టి నెల నెలా ఇవ్వాల్సిందే. ఇక బార్‌లు కూడా స్టేషన్‌కు మామూళ్లు పంపించాల్సిందే. పోలీసులేమో డ్రోన్‌లతో నిఘా అంటూ చెప్పి బహిరంగ మద్యపానం చేస్తున్నారంటూ రిక్షా కార్మికుడినో, తాపీ మేస్త్రీనో తెచ్చి స్టేషన్లో పెడుతున్నారు.

బాస్‌కు తెలిసే..

మామూళ్ల దందా 'పోలీస్ బాస్'కు తెలిసే జరుగుతోందని, ఇంత విచ్చలవిడిగా సాగుతున్న విషయం తెలియకుండా ఎలా ఉంటుందని ఓ పోలీసు అధికారి 'సాక్షి'తో చెప్పడం గమనార్హం. విచిత్రమేమంటే కొన్ని పోలీసుస్టేషన్లలో వచ్చిన సొమ్ము మొత్తం సీఐ తీసుకుంటున్నారని, తమకు పైసా ఇవ్వడం లేదని ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో గణాంకాలు..

మద్యం షాపుల నుంచి కేటగిరీల వారీగా నెలవారీ వసూళ్లు

ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్	రూ.45,000
ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్	రూ.10,000
ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్	రూ.10,000
సివిల్ పోలీసులు	రూ.20,000

క్లుప్తంగా

యువకుడి దుర్మరణం



మృతుడు శేఖర్

చిలమత్తూరు: ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొన్న ఘటనలో ద్విచక్రవాహనంపై వెళుతున్న ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని చిక్‌మగళూరు జిల్లా నగరగెరె పట్టణానికి చెందిన శేఖర్ (26) మరో వ్యక్తితో కలసి ఆదివారం అర్ధరాత్రి సమయంలో ద్విచక్ర వాహనంపై కొడికొండ చెక్‌పోస్టు వద్ద 44వ జాతీయ రహదారిపై హైదరాబాద్ వైపుగా రోడ్డు దాటుతున్న సమయంలో బెంగళూరు నుంచి వేగంగా దూసుకొచ్చిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు వెనుక నుంచి ఢీకొంది. ఘటనలో రోడ్డుపై పడిన శేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ఉన్న మరో వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ఖాద్రీశుడి ఆలయ కమిటీ సభ్యుల నియామకానికి నోటిఫికేషన్ జారీ

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన పాలక మండలి సభ్యుల నియామకానికి నోటిఫికేషన్ జారీ అయింది. ఈ మేరకు ఆలయ ఈఓ వి.శీనివాసరరెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న వారు నిర్ణీత దరఖాస్తులను పూరించి ఈ నెల 27వ తేదీ సాయంత్రం 6 గంటల్లోపు కదిరిలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కార్యాలయంలో అందజేయాలి. గడువు ముగిసిన తర్వాత దరఖాస్తులు స్వీకరించబడవు.

డ్రైనేజీలో పడి చేనేత కార్మికుడి మృతి



కాలువలో పడి మృతిచెందిన నాగరాజు

ధర్మవరం: పట్టణంలోని శ్రీదేవి థియేటర్ వద్దనున్న డ్రైనేజీలో పడి ఓ చేనేత కార్మికుడు మృతిచెందాడు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని పేట బసవన్నకట్టవీధికి చెందిన సపారు నాగరాజు(60) పట్టుచీరలను మడతలు వేసేందుకు వెళుతుంటాడు. ఐదేళ్ల క్రితం భార్య మృతి చెందింది. అప్పటి నుంచి నాగరాజు మద్యానికి అలవాటు పడ్డాడు. ఆదివారం రాత్రి మద్యం సేవించి శ్రీదేవి థియేటర్ సమీపంలో గ్రంథాలయం ఎదురుగా మురుగు కాలువలో పడిపోయాడు. రాత్రి వర్షం ఎక్కువగా రావడంతో కాలువలో నీటి ప్రవాహం ఎక్కువైంది. నాగరాజు నీటిలో మునిగి మృతిచెందాడు. సోమవారం ఉదయం పారిశుద్ధ్య కార్మికులు కాలువను శుభ్రం చేస్తుండగా మృతదేహం కనిపించడంతో బయటకు తీశారు. స్థానికులు గుర్తించి మృతుని కుమారుడు మనోహర్‌కు సమాచారం అందించారు. కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

● మంటపాలు శిథిలం..
మెట్ల దారి అధ్వానం!



శిథిలావస్థలో ఉన్న మంటపం

పెనుకొండ: రాచరిక వైభవానికి సాక్షిగా నిలిచిన పెనుకొండ కోటలోని పలు మంటపాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ మంటపాలకు వెళ్లేందుకు గగన్‌మహల్ వెనుక మెట్ల దారి నిర్మించారు. 500 ఏళ్ల క్రితం దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో కొండపైకి వెళ్లే ప్రజలు అత్యవసర సమయంలో ఈ మంటపాల్లో తలదాచుకునేవారు. ప్రస్తుతం మెట్లదారి మొత్తం ముళ్ల కంపల మయమైంది. శిథిలావస్థకు చేరుకున్న దాదాపు 20 మంటపాలను అభివృద్ధి చేయడంతో పాటు, మెట్ల దారిని మెరుగు పరచాలని స్థానికులు కోరుతున్నారు.



కూలడానికి సిద్ధంగా ఉన్న మంటపం

గ్రౌండ్ రిపోర్ట్



మెట్ల దారిలో శిథిలావస్థకు చేరుకున్న మంటపం



మెట్ల దారిలో చెట్ల మధ్య ఉన్న ఓ మంటపం

పరిష్కార వేదికకు 55 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న డీఎస్పీ ఆదినారాయణ

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై 55 వినతులు అందాయి. డీఎస్పీ ఆదినారాయణ స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్ట పరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజరీ సాయినాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు

దళారీ మోసంపై ఫిర్యాదు

మామిడి ఫలసాయాన్ని కొనుగోలు చేసిన ఓ దళారీ రూ.14.25 లక్షలు చెల్లించకుండా మోసం చేశాడంటూ నల్లమాడ మండలం పెనుములకుంటపల్లికి చెందిన రైతు కేశవ వాపోయాడు. సోమవారం డీఎస్పీ ఆదినారాయణకు ఫిర్యాదు చేసిన అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. మూడు నెలల క్రితం నల్లమాడ మండలం బడన్నపల్లి గ్రామానికి చెందిన నాగభూషణరెడ్డి తన మామిడి తోటలోని ఫలసాయాన్ని రూ.14 లక్షలకు కొనుగోలు చేశాడని గుర్తు చేశారు. మధ్యవర్తిత్వం వహిస్తూ అనంతరం రూ.14.25 లక్షలకు విక్రయించి సొమ్ము చేసుకున్నాడని వివరించారు. ఫలసాయం మొత్తం మార్కెట్‌కు తరలించినా నేటికీ డబ్బు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నాడని వాపోయాడు. ఈ విషయంపై నల్లమాడ పీఎస్‌లో ఫిర్యాదు చేస్తే వ్యాపారిని పిలిపించి పోలీసులు మాట్లాడారన్నారు. వారం రోజులు సమయం ఇచ్చినా సొమ్ము చెల్లించలేదని, ఇదేమని అడిగితే పోలీసులు సైతం సమాధానం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం చేయాలంటూ ప్రజాసమస్య పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

స్టాప్‌లో బస్సు ఆపలేదని గొడవ

కళ్యాణదుర్గం/అనంతపురం క్రైం: చెయ్యెత్తినా.. బస్సు ఆపకుండా వెళ్లిపోవడంతో డ్రైవర్‌తో ఓ ప్రైవేట్ ఉద్యోగిని గొడవ పడింది. మూడు రోజుల క్రితం చోటు చేసుకున్న ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో వెలుగులోకి వచ్చింది. వివరాలు.. సుచరిత అనే ప్రైవేట్ ఉద్యోగిని అనంతపురం నుంచి కళ్యాణదుర్గం వచ్చేందుకు సిద్ధమై అనంతపురం నడిమి వంక బస్టాఫ్ వద్ద వేచి ఉండగా ఆర్టీసీ అద్దె బస్సు అటుగా వచ్చింది. ఆమె చెయ్యెత్తినా డ్రైవర్ ఆపకుండా నిర్లక్ష్యంగా ముందుకు వెళ్లిపోయాడు. అత్యవసరం కావడంతో సదరు మహిళ కుమారుడి సహకారంతో ద్విచక్ర వాహనంపై బస్సును అనుసరిస్తూ ఓవర్‌టేక్ చేసి ఆపి ఎక్కింది. చెయ్యెత్తినా బస్సు ఎందుకు ఆపలేదంటూ డ్రైవర్‌ను నిలదీయడంతో అతను నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుని పరిస్థితి విషమించింది. చివరకు ప్రయాణికులు జోక్యం చేసుకోవడంతో వివాదం సద్దుమణిగింది.ఈ అంశాన్ని చిత్రీకరించిన ప్రయాణికుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడంతో ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ నిర్వాకం వెలుగు చూసింది. తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదని నెటిజన్లు మండిపడ్డారు.

వివాహితతో అనుచిత ప్రవర్తన

● వ్యక్తిపై కేసు నమోదు

ధర్మవరం అర్బన్: వివాహిత పట్ల అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ధర్మవరం టూ టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. ధర్మవరంలోని శారదానగర్ నివాసముంటున్న సాకే చందన, గణేష్ దంపతులు ఏడాదిన్నర క్రితం బత్తలపల్లిలో కిరాణా దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగించేవారు. వ్యాపార లావాదేవీలన్నీ చందన చూసుకునేది. గణేష్ కియా కంపెనీలో పనిచేస్తూ రోజూ వెళ్లి వచ్చేవాడు. ఈ క్రమంలో బత్తలపల్లి తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నివాసముంటున్న బోయ గోపాల్ తరచూ అంగడికి వస్తూ చందనతో మాటలు కలిపి ఆమె ఫోన్ నంబర్ సేకరించుకున్నాడు. అనంతరం పలుమార్లు చందనతో ఫోన్‌లో మాట్లాడాడు. ఆ సమయంలో ఆమె మాటలను రికార్డు చేసి, వాటిని చందనకు వినిపించి, తనకు డబ్బు ఇవ్వాలని, లేకపోతే తన కోరిక తీర్చాలని బ్లాక్‌మెయిల్ చేయసాగాడు. ఈ విషయాన్ని తన భర్తకు చందన చెప్పడంతో బత్తలపల్లి నుంచి ధర్మవరానికి మకాం మార్చారు. అయినా చందనను గోపాల్ ఇబ్బంది పెట్టడం మానలేదు. ఈ నెల 7న గణేష్ డ్యూటీకి వెళ్లిన సమయంలో 8వ తేదీ తెల్లవారుజామున చందన ఇంటికి గోపాల్ వెళ్లి తలుపులు గట్టిగా కొట్టాడు. దీంతో ఆమె తలుపులు తీయగానే తనతో వస్తావా? రావా అంటూ బలవంతం చేస్తూ తన మాట వినకపోతే చంపేస్తానంటూ బెదిరింపులకు దిగాడు. ఆ సమయంలో చందన గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు అక్కడకు చేరుకుంటుండగా గోపాల్ పారిపోయాడు. ఘటనపై బాధితురాలు సోమవారం ఉదయం టూ టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. విచారణ అనంతరం బోయ గోపాల్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

ఆర్టీసీ స్థలాలను కాపాడుకుందాం : ఈయూ



సంఘీభావం తెలుపుతున్న ఈయూ నాయకులు

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ స్థలాల పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు చేపడతామని ఆ సంస్థ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు హెచ్చరించారు. విజయవాడ నడిబొడ్డున ఉన్న ఆర్టీసీ స్థలాన్ని లూలూ షాపింగ్ మాల్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీఓ 137ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర నాయకులు నబీరసూల్, నాగార్జునరెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరై, ప్రసంగించారు. విజయవాడలోని గవర్నర్‌పేట పాత బస్టాండ్‌కు సంబంధించిన 4.15 ఎకరాల భూమి రూ. 400 కోట్ల విలువ చేస్తుందన్నారు. ఈ స్థలాన్ని లూలూ సంస్థకు అప్పగించేందుకు ప్రభుత్వం 137 జీఓను విడుదల చేసిందన్నారు. ఈ జీఓను వెంటనే వెనక్కి తీసుకోకపోతే ఉద్యోగులు, కార్మికులను కలుపుకుని ఐక్య ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. 2014లోనూ ఇలా కట్టబెడితే ధర్నాలు చేసి సంస్థ ఆస్తులను కాపాడుకున్నామని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన ఆర్టీసీ ఉద్యోగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా... దశాబ్దాల చరిత్ర కలిగిన ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్రలు సాగిస్తుండడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఈయూ జిల్లా అధ్యక్షుడు వైపీ రావు, కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి రమణప్ప, నాయకులు శంకరప్ప, ఆదినారాయణ, రుక్మిణి, ఆదెన్న, ఆనంద్, హనుమాన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

7 లారీల రేషన్ బియ్యం స్వాధీనం



రైస్‌మిల్లులో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని లారీలో లోడ్ చేస్తున్న హమాలీలు

యాడికి: అక్రమంగా రైస్ మిల్లులో నిల్వ చేసిన టన్నుల కొద్దీ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్నట్లు యాడికి తహసీల్దార్ ప్రతాపరెడ్డి, సీఐ ఈరన్న తెలిపారు. వివరాలను సోమవారం వారు వెల్లడించారు. యాడికిలోని పెద్దపేటకు పోతున్న మార్గంలో ఉన్న బలరాముడు రైస్ మిల్లులో రేషన్ బియ్యం నిల్వలు ఉన్నట్లుగా తెలుసుకున్న అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. టన్నుల కొద్దీ రేషన్ బియ్యాన్ని గుర్తించిన అధికారులు వెంటనే విషయాన్ని తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి దృష్టికి తీసుకెళ్లి భద్రత కల్పించాలని కోరారు. దీంతో ఆయన ఆగమేఘాలపై అక్కడకు చేరుకున్నారు. 50 కిలోల చొప్పున ఒక్కో బస్తాలో నింపి ఒక్కో లారీలో 30 నుంచి 32 టన్నుల వరకు హమాలీల ద్వారా లోడ్ చేయించారు. మొత్తం ఏడు లారీల్లో 215 టన్నుల రేషన్ బియ్యాన్ని గుంతకల్లులోని స్టాక్ పాయింట్‌కు తరలించినా... ఇంకా మిగులు ఉంది. ఈ బియ్యాన్ని కూడా స్టాక్ పాయింట్‌కు తరలించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియ ముగిసే వరకూ ఆ రైస్ మిల్లు పరిసరాల్లోకి కొత్త వ్యక్తులను రానివ్వకూడదని, మిల్లు చుట్టూ గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని సీఐ ఈరన్నను ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎం.రమణయ్య, డీటీ శ్రీనివాసులు, సీఎస్‌డీటీ మల్లేసు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం చియ్యేడు గ్రామానికి చెందిన తిమ్మన్నగారి రాజశేఖర్ (36) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య రాజేశ్వరి, ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగించేవారు. ఈ క్రమంల కుటుంబ పోషణ కోసం ప్రైవేట్ వ్యక్తుల వద్ద చేసిన అప్పులకు వడ్డీలు పెరిగి తడిసి మోపడైంది. డ్వాక్రా సంఘంలో రాజేశ్వరి తీసుకున్న రుణానికి సంబంధించి కంతులు చెల్లించలేని ఇబ్బంది పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదంటూ మదనపడేవాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం డ్వాక్రా డబ్బులు చెల్లించే విషయంలో దంపతుల మధ్య గొడవ జరిగింది. అనంతరం డ్వాక్రా సమావేశానికి రాజేశ్వరి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని ఆ సమయంలో రాజశేఖర్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. డ్వాక్రా సమావేశం ముగిసిన తర్వాత ఇంటికి వచ్చిన భార్య... తలుపు తట్టినా ఎంతసేపటికీ తీయకపోవడంతో అనుమానం వచ్చి బంధువులు, చుట్టుపక్కల వారికి తెలపడంతో వారొచ్చి బలవంతంగా తలుపు తీసి లోపలకు ప్రవేశించారు. అప్పటికే విగతజీవిగా ఉరికి వేలాడుతున్న రాజశేఖర్‌ను గమనించి హుటాహుటిన అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై ఇటుకలపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పురుగుల మందు తాగి..

పెద్దవడుగూరు: మండంలోని కాశేపల్లి గ్రామానికి చెందిన హనుమంతరెడ్డి(48) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన హనుమంతరెడ్డి సాయంత్రమైనా ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. ఈ లోపు 44వ జాతీయ రహదారిపై టోల్ ప్లాజా సమీపంలోని పొలంలో విగతజీవిగా పడి ఉన్న హనుమంతరెడ్డిని గుర్తించిన స్థానికుల సమాచారంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లుగా గుర్తించి, సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, ఆయన మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

ఒంటరితనాన్ని తాళలేక..

బ్రహ్మసముద్రం : మండలంలోని కన్నేపల్లి గ్రామానికి చెందిన హరిజన హనుమంతు (42) ఆత్మహత్య చేసుకున్నాడు. మూడేళ్ల క్రితం ఆయన భార్య మృతి చెందింది. అప్పటి నుంచి మనోవేదనకు లోనైన ఆయన ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావి గ్రామానికి చెందిన వడ్డే పాపన్న(80) కర్ణాటకలోని మొలకాల్మూరులో అనుమానాస్పద స్థితి మృతి చెంది కనిపించాడు. ఆయనకు భార్య భీమక్క, నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. మొలకాల్మూరుకు వెళుతున్నట్లుగా సోమవారం ఉదయం ఇంట్లో చెప్పి బయలుదేరిన వ్యక్తి ... మధ్యాహ్నానికే అక్కడి ఓ లాడ్జిలో మృతిచెందినట్లుగా సమాచారం అందడంతో కుటుంబసభ్యులు తరలి వెళ్లారు. ఆయన మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గైనిక్ సర్జరీ ఎందుకు చేశారు?

● విచారణ కమిటీ సభ్యుల ప్రశ్నతో తడబడిన డాక్టర్ రమణ నాయక్

అనంతపురం మెడికల్: గైనికాలజిస్టులు చేయాల్సిన సర్జరీని మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటీపీ) అనుమతులు లేకుండా ఎందుకు చేశావంటూ సర్వజనాస్పత్రి సర్జరీ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమణ నాయక్‌ను విచారణ కమిటీ సభ్యులు ప్రశ్నించారు. ఇందుకు డాక్టర్ రమణ నాయక్ నుంచి మౌనమే సమాధానమైంది. బుక్కరాయసముద్రం మండలం చెదళ్ల గ్రామానికి చెందిన రాధమ్మ(29) మృతికి సంబంధించి డాక్టర్ రమణ నాయక్ ఎట్టకేలకు సోమవారం విచారణకు హాజరయ్యారు. విచారణ కమిటీ సభ్యులు ప్రొఫెసర్లు డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ షంషాద్‌బేగం, సర్జరీ డాక్టర్ మనోహర్‌రెడ్డి విచారణ చేపట్టి గంటలోపు పూర్తి చేసి నివేదికను జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాంకు అందజేశారు. సర్జరీ జరిగే సమయంలో అధిక రక్తస్రావమైందని, ఆపేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయిందని కమిటీ సభ్యులకు డాక్టర్ రమణ నాయక్ నివేదించినట్లు సమాచారం.

లోపించిన పారదర్శకత

కాగా, రాధమ్మ మృతిపై చేపట్టిన విచారణలో పారదర్శకత లోపించిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. సర్జరీలో డాక్టర్ రమణ నాయక్, అనస్తీషియా వైద్యురాలు డాక్టర్ లావణ్యతో పాటు శ్రీకృప ఆస్పత్రికి చెందిన మరికొందరు పాల్గొన్నారు. వాస్తవానికి పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌కు సంబంధించి సర్జరీలో పాల్గొన్న అందరినీ విచారణ చేపట్టాల్సి ఉండగా కేవలం డాక్టర్ రమణనాయక్, డాక్టర్ లావణ్యతో పాటు సర్జరీలో పాల్గొనని ఓ పీహెచ్‌సీకి చెందిన సిబ్బందిని బాధ్యులను చేస్తూ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబదేవి విచారణకు ఆదేశాలు జారీ చేయడం విమర్శలకు తావిస్తోంది. గతంలో ఓ ఆస్పత్రిలో ఇలాంటి ఘటననే చోటు చేసుకుంటే యాక్ట్ ఉల్లంఘన కింద పోలీసులు కేసు నమోదు చేసి, బాధ్యులను జైలుకు పంపిన విషయాన్ని ఈ సందర్భంగా జీజీహెచ్‌లోని పలువురు గుర్తు చేసుకున్నారు. అయితే సర్జరీలో పాల్గొన్న శ్రీకృప ఆస్పత్రి స్టాఫ్‌నర్సులు, ఓటీ టెక్నీషియన్లు, తదితరులను తప్పించడం అనుమానాలకు తావిస్తోంది. పారదర్శకత లోపించిన ఈ అంశంపై కలెక్టర్ లోతుగా విచారణ చేపడితే అసలు దోషులు ఎవరైంది వెలుగుచూసే అవకాశముందని ఆరోగ్యశాఖ వర్గాలంటున్నాయి.

డాక్టర్ సస్పెన్షన్



ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమణ నాయక్‌ను సస్పెండ్ చేస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) నుంచి సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. లావణ్య, శ్రీకృప పేరుతో ఆస్పత్రులను నడుపుతూ ఇతర విభాగాలకు సంబంధించి సర్జరీలు చేయడం, తదితర ఆరోపణలపై డాక్టర్ బి.రమణ నాయక్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వైద్య కళాశాల, సర్వజనాస్పత్రి అధికారుల అనుమతి లేకుండా జిల్లా కేంద్రాన్ని విడిచి వెళ్లకూడదని కూడా స్పష్టంగా పేర్కొన్నారు.

దత్తత అంశంలో నిబంధనలు తప్పనిసరి

● కలెక్టర్ టీఎస్ చేతన్



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్, అధికారులు

ప్రశాంతి నిలయం: పిల్లల దత్తత అంశంలో నిబంధనలు అనుసరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. పిల్లల దత్తత అంశానికి సంబంధించి మహిళాశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఫోస్టర్ అడాప్షన్ కేర్ పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆవిష్కరించి, మాట్లాడారు. తల్లిదండ్రులు లేని ఆరేళ్ల పైబడి 18 ఏళ్ల లోపు ఉన్న పిల్లలను రెండేళ్ల పాటు పెంచి ప్రేమానురాగాలు పంచిన అనంతరం శాశ్వత దత్తత కల్పించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఐసీడీఎస్ పీడీ ప్రమీల, సీడీపీఓ మహేష్, మిషన్ కోఆర్డినేటర్ గీతాబాయి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పన పేరుతో టోకరా

గార్లదిన్నె: ఆర్మీ, రైల్వే శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మించి నిరుద్యోగులను మోసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు.. గార్లదిన్నె మండలం కనుంపల్లికి చెందిన సుధాకర్, రవిరాజా ఇద్దరూ అన్నదమ్ములు. 10 ఏళ్ల క్రితం గ్రామ సమీపంలోనే 44వ జాతీయ రహదారి పక్కన ఆర్మీ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. కోచింగ్‌కు వచ్చిన నిరుద్యోగులకు ఆర్మీతో పాటు రైల్వే శాఖలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించారు. దీంతో ఏడేళ్ల క్రితం గార్లదిన్నెకు చెందిన రవితేజ రూ.3 లక్షలు చెల్లించాడు. 2024లో శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం కట్టకిందపల్లికి చెందిన రామాంజనేయులు కూడా రైల్వేలో టెక్నీషియన్ ఉద్యోగం కోసం రూ.4లక్షలు ఫోన్‌పే ద్వారా చెల్లించి, మిగిలిన రూ.6లక్షలను నగదు రూపంలో చెల్లించాడు. కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్ కార్యాచరణను అమలు చేసిన తర్వాత ఆర్మీ కోచింగ్ సెంటర్‌ను మూసివేశారు. ఈ క్రమంలో డబ్బులు చెల్లించిన ఇద్దరు నిరుద్యోగులు తమకు ఉద్యోగాలు ఎప్పుడు ఇప్పిస్తారని సుధాకర్, రవిరాజాకు తరచూ అడుగుతున్నా ఫలితం లేకపోయింది. దీంతో అనుమానం వచ్చిన వారు తాము కట్టిన డబ్బు వెనక్కు ఇవ్వాలని కోరారు. భూమి విక్రయానికి పెట్టామని, దానిని అమ్మిన తర్వాత డబ్బు ఇస్తామని వారు సర్దిచెప్పడంతో నమ్మారు. రోజులు గడుస్తున్నా వారు స్పందించకపోవడంతో తాము మోసపోయినట్లు నిర్ధారించుకుని సోమవారం గార్లదిన్నె పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనపై విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా పేర్కొన్నారు.

తాగుడుకు డబ్బివ్వలేదని ఆత్మహత్య



మృతుడు గంగాధరప్ప

పరిగి: మద్యం తాగేందుకు డబ్బులివ్వకపోవడంతో క్షణికావేశంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పరిగి మండలం ఎస్ ముద్దిరెడ్డిపల్లికి చెందిన సీకే గంగాధరప్ప(44)కు భార్య రాధక్క, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈ క్రమంలో గంగాధరప్ప మద్యానికి బానిసయ్యాడు. రెండు రోజులుగా మద్యం తాగేందుకు కుటుంబసభ్యులను డబ్బులు అడుగుతూ వచ్చాడు. అయితే ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో తాగుడు మానేయాలని కుటుంబసభ్యులు సర్దిచెబుతూ వచ్చారు. దీంతో క్షణికావేశానికి లోనైన గంగాధరప్ప.. సోమవారం ఉదయం 6 గంటల సమయంలో గ్రామ శివారులోని తన పొలంలో చెట్టుకు పంచెతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకునన పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. రాధక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఐ కేర్ సెంటర్‌పై దాడి కేసులో ఐదుగురి అరెస్ట్

అనంతపురం: ఈ నెల 9న అనంతపురంలోని అస్రా ఐ కేర్ సెంటర్‌పై దాడి చేసిన ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు రెండో పట్టణ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. పట్టుబడిన వారిలో శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం కుంటిమద్ది గ్రామానికి చెందిన శ్రీశైలం శివశంకర్, పాపిరెడ్డిపల్లికి చెందిన మురికి పృథ్వీ, రామగిరికి చెందిన ఆది ఆంధ్ర మారుతి, చెన్నేకొత్తపల్లి మండలం నాగసముద్రం నివాసి గండ్లూరి వెంకటరమణ, అనంతపురంలోని బుడ్డప్ప నగర్‌కు చెందిన బండారు అనిల్ కుమార్ ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.